క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన



కమలాపూర్: తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం 5 లో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, వెల్ బేబీ షో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులతో కలిసి కేంద్రం ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ టీచర్ పద్మకుమారి, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎల్కతుర్తి: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన మండలంలోని బావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సబ్బు మహేష్ ఈనెల 7వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడకు వెళ్లాడు. తిరిగి శనివారం ఇంటికి రాగ గేటుకు వేసిన తాళం వేసి ఉంది కానీ ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో మహేష్ ఇంట్లోకి వెళ్ళి చూశాడు. ఇంట్లోని బట్టలు, ఇంటి సామాగ్రి చిందరవందరగా పడి ఉండగా, బీరువా లాకర్ తెరిచి ఉంది. అందులోని రెండు తులాల బంగారు నక్లెస్, ఒక జత చెవికమ్మలు, 15తులాల వెండిపట్టీలు తదితర ఆభరణాలు కనిపించలేదు. బాధితుడు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

టీపీఆర్‌ఎస్ రాష్ట్ర చైర్మన్‌గా సురేష్



ఆత్మకూరు: టీపీఆర్ఎస్ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా మండలంలోని పెద్దపూర్‌కు చెందిన కొలగాని సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపకుడు సింగారం ప్రేమ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర నాయకులకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

108 అంబులెన్స్‌లో రికార్డుల తనిఖీ



ఆత్మకూరు: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ సర్వీసు రికార్డులను ఎగ్జిక్యూటివ్ మేనేజర్ శేఖర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. రోజువారి కేసుల వివరాలను పరిశీలించి, మెడికల్ పరికరాలను తనిఖీ చేశారు. సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రజలు 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరును అభినందించారు. ఈఎంటీ రాజ్‌కుమార్, పైలట్ గణపతి పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

దామెర: కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి సహాయ మంత్రి బీఎల్ శర్మ నేడు మండలానికి రానున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. దుర్గంపేట సమీపంలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

2కే రన్‌ను విజయవంతం చేయాలి

శాయంపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పరకాల పట్టణంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న 2కే రన్‌ను విజయవంతం చేయాలని ఎస్సై వీరభద్రరావు శనివారం ప్రకటనలో కోరారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో పరకాల సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని యువకులు, విద్యార్థులు, ఉత్సాహవంతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 2కే రన్‌లో పాల్గొనే వారు పేరు, గ్రామం పేరును నమోదు చేసుకునేందుకు 8712685227 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

బ్రిడ్జి ప్రారంభానికి తరలిరావాలి

శాయంపేట: మండలంలోని జోగంపల్లి నుంచి కొప్పుల గ్రామాల మధ్య గల చలివాగు పై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఎంపీపీ తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 12వ తేదీన బ్రిడ్జి ప్రారంభోత్సవంతో పాటు కొప్పుల గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం



శాయంపేట: కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి, దివ్యాంగులు



పరకాలలో..

శాయంపేట: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తిరుపతిరెడ్డి అన్నారు. మంచిర్యాల బహిరంగ సభలో దివ్యాంగుల ఫించన్ మరో రూ. 1000 పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటన చేసిన సందర్భంగా మండల కేంద్రంలో శనివారం దివ్యాంగులతో కలిసి సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధితో దూసుకెళ్తుందన్నారు. దివ్యాంగులకు రూ. 3016 నుంచి రూ. 4016 పెంచడంతో వారి కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. సంక్షేమ పథకాల్లో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగ నిలుస్తుందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌పార్టీ సునామి సృష్టించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, నాయకులు నందం, లక్ష్మారెడ్డి, మోహన్, పాపయ్య, కరణ్‌బాబు, సదయ్య, కార్తిక్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్నిధి కేసీఆర్

పరకాల: రాష్ట్రంలోని దివ్యాంగులకు సీఎం కేసీఆర్ పెన్నిదిగా నిలిచారని బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు శ్రీను అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.1000 పెన్షన్ పెంచటంపై బీఆర్ఎస్ పట్టణ కమిటీ, వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో సంబురాలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీను, వైస్‌చైర్మన్ విజయపాల్‌రెడ్డి,ఎన్‌పీఆర్‌డీ ఇండియా కమిటీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు నర్సింగరావు, రవి, రాజేంద్రప్రసాద్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్‌లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కమలాపూర్‌లో..

కమలాపూర్: దివ్యాంగుల పింఛన్ మరో వెయ్యి రూపాయలు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషకరమని మర్రిపల్లిగూడెం సర్పంచ్ ఇనుగాల కిరణ్మయి అన్నారు. ఈ మేరకు శనివారం సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని, దివ్యాంగులకు ఆపద్బాంధవుడిలా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న వేద పండితులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

ధర్మసాగర్: మండల కేంద్రంలోని శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గత సోమవారం నుంచి గురువారం వరకు బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించిన గ్రామస్తులు శనివారం ధ్వజస్తంభ పూజలు చేసి ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా పూజారులు రంగాచార్యులు, నర్సింహాచార్యులు, భాస్కరాచార్యులు, రాజు, సాయిలతో పాటు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు గుంతల మయంగా మరిందని, రోడ్డు వేయించాలని గ్రామ అర్చకులు కడియంను విన్నవించారు. స్పందించిన ఆయన తన సీడీఎఫ్ నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో స్థానిక సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, ఉత్సవ కమిటీ కోశాధికారి రామేశ్వర్‌రావు, సహాయ కోశాధికారి రాజు, సభ్యులు రఘుపతిరాజు, జయపాల్‌రెడ్డి, రమేష్, బాలరాజు, విజయ్, సాంబరాజు, రమేష్, సతీష్, దేవేందర్, వెంకన్నలు పాల్గొన్నారు.

నాడు ఆగమైన తెలంగాణ నేడు అభివృద్ధిలో ముందుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

దామెర: నాడు సమైక్య రాష్ట్రంలో ఆగమైన తెలంగాణ నేడు అభివృద్ధిలో ముందుందని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో శనివారం సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజాపరిషత్ కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకున్న సీఎం కేసీఆర్ వినూత్నమైన పథకాలకు రూపకల్పన చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని, కొత్త మండలంగా ఏర్పాడిన దామెర మండలం అభివృద్ధిలో పథంలో నడుస్తుందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కల్పన, వైస్ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ నాగరాజు, ఎంపీటీసీలు కృపాకర్‌రెడ్డి, రాము, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

చల్లాకు చిత్తశుద్ధి ఉంటే నిరాహార దీక్ష చేయాలి



మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

పరకాల: ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పరకాలను అమరవీరుల జిల్లాగా సాధించేందుకు అమరణ నిరాహార దీక్ష చేయాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరధామంలో ఆయన వివిధ ప్రజాసంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో మహబూబాబాద్, జనగాం, ములుగు, భూపాలపల్లి వంటి జిల్లాలను అక్కడి ఎమ్మెల్యేల ఒత్తిడితో సీఎం కేసీఆర్ జిల్లాలుగా ప్రకటించారని అన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహారించడం వలనే పరకాలకు అన్యాయం జరిగుతుందని ఆరోపించారు. ఇప్పటికైన జిల్లా సాధన పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు బిక్షపతి, సాధన కమిటీ కన్వీనర్ వెంకటస్వామి, కౌన్సిలర్ పూర్ణచారి, నాయకులు వీరస్వామి, పురుషోత్తం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



ఆరోగ్య విషయాలు తెలుసుకుంటున్న చీఫ్‌విప్

హన్మకొండ: ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హనుమకొండ లష్కర్‌బజార్‌కు చెందిన రెడ్డి రవికుమార్ కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శనివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రవికుమార్‌కు అందుతున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కాశిబుగ్గ: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. నాయకులతో కలిసి 20వ డివిజన్‌లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్త నమిండ్ల రాజును పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.అయూబ్, ఎంబాడి రవీందర్, జన్ను రవి, గొల్లన రవి, జన్ను వేణు, ఆదాం, రాజు, యాదగిరి, సాబీర్ తదితరులు ఉన్నారు.

స్నేహితుల చేయూత





రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రబృందం

కమలాపూర్: మండల కేంద్రంతో పాటు శనిగరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలకు మృతుల స్నేహితులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన తుపాకుల రాజ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా 2003–04 సంవత్సరంలో అతనితో పదో తరగతి చదువుకున్న స్నేహితులు తలోకొంత పోగు చేసి రూ.50 వేలు రాజ్‌కుమార్ పిల్లల పేరితో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌తో పాటు మరో రూ.20 వేలు నగదును బాధిత కుటుంబానికి అందించారు. అలాగే శనిగరం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చెరిపెల్లి కిరణ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని స్నేహితులు సాయం అందించి అండగా నిలిచారు. కిరణ్‌కుమార్ ఇద్దరు కూతుర్ల పేరిట రూ.45 వేలు, బీపీపీటీ యూనియన్ ఆధ్వర్యంలో మరో రూ.30 వేలు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను అందజేశారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన బాధితులు సాయం అందించిన స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. చెరిపెల్లి భాగ్యలక్ష్మి, ప్రశాంత్, మరియమ్మ, కుమార్, ప్రదీప్, కృష్ణఫర్, అనిల్, యూనియన్ అధ్యక్షుడు ఆమోస్, ప్రశాంత్, మనోహర్, కోటి, ప్రదీప్, మహేందర్ పాల్గొన్నారు.

ఎల్‌బీ కాలేజీ కుంభకోణాలపై విచారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బక్క జడ్సన్

నయీంనగర్: లాల్ బహదూర్ (ఎల్‌బీ) కళాశాలలో జరిగిన ఆర్థిక కుంభకోణాలపై సోషల్ ఆడిట్ జరపాలని కాంగ్రెస్ నాయకుడు బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్లలో కళాశాల నిధులు, ప్రత్యేక రుసుం ఖాతాలు, యూజీసీ నిధులను కళాశాల మునుపటి కార్యదర్శులు దారి మళ్లించారని ఆరోపించారు. 110 మంది విద్యార్థుల హాస్టల్ సదుపాయం కోసం యూజీసీ 1.1కోట్లు మంజూరు చేయగా భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని తప్పుడు వినియోగ ధ్రువీకరణ పత్రం సృష్టించారని అన్నారు. నిర్మాణం పూర్తి కావడానికి ఇంకా రూ.45లక్షలు అవసరమవుతాయని పేర్కొన్నారని తెలిపారు. మరుగుదొడ్లు, పుస్తకాల కొనుగోలు, లైబ్రరీలో సౌకర్యాలకు 9.1లక్షలు మంజూరు చేయగా తప్పుడు రశీదులు ద్వారా సృష్టించి డబ్బును కాజేశారని వివరించారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణం కోసం రూ.12లక్షలు మంజూరు కాగా, ఇప్పుడు అక్కడ సింథటిక్ ట్రాకే లేదని ఎద్దేవాచేశారు. ఆర్థిక మోసాలకు పాల్పడిన సభ్యులు, విచారణను అడ్డుకుంటున్న ప్రస్తుత చైర్మన్‌ను యూజీసీ ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాంపూర్‌లో ‘వెల్ బేబీ షో’



వెల్ బేబీ షోలో పాల్గొన్న ఆర్‌జేడీ ఝాన్సీ

మడికొండ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాంపూర్ గ్రామంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి అధ్యక్షతన మహిళా శిశు సంక్షేమ శాఖ సమక్షంలో పిల్లలకు వెల్ బేబీ షో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ తల్లిదండ్రుల తమ పిల్లల ఎత్తు, బరువు, జబ్బ చుట్టుకొలతలను ప్రతీనెల అంగన్‌వాడీ సెంటర్లలో తీయించుకొని వారి ఎదుగుదల కోసం పౌష్టికాహారం అందించాలని సూచించారు. వయస్సుకు తగ్గ ఆహారం అందించడం వల్ల చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం సేవలను పిల్లలతోపాటు బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, వనజ, ఏఎన్ఎం వసంత, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, మంజుల, శారద, సంధ్య, స్వరూప, పద్మ, ఆయా రజిత పాల్గొన్నారు.

ఎనీ టైం మద్యం

- దూపకుంట రోడ్డుపై డబ్బా ఏర్పాటు చేసి అమ్మకాలు
- నిర్జన ప్రదేశంలో మందుబాబుల ఇష్టారాజ్యం
- అటువైపు వెళ్లేందుకు భయపడుతున్న ప్రజలు, వాహనదారులు



దూపకుంట రోడ్డుపై బెల్ట్‌షాపు



దబ్బా పక్కన పడిఉన్న ఖాళీ మద్యం సీసాలు

ఖిలా వరంగల్: జనావాసాలకు దూరంగా నిర్జన ప్రదేశంలో ఓ డబ్బా ఏర్పాటు చేసి మద్యం చేసి అమ్మకాలు చేస్తున్నారు. అక్కడ పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడైనా మద్యం దొరుకుతుంది. ఈక్రమంలో రాత్రి వేళల్లో అక్కడ అడ్డా వేసి మద్యం తాగి జులాయిలు, ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటారు. ఆ సమయంలో అటువైపు వెళ్లేందుకు వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

మామూళ్లు ఇస్తున్నా నాకేం భయం

వరంగల్ 37వ డివిజన్ దూపకుంట రోడ్డుపై ఓ మహిళ నిర్వహించే ఓ బెల్ట్ షాపులో ఎప్పుడైనా మద్యం దొరుకుతుంది. నగరంలోని పోకిరీలు అక్కడే తిష్టవేసి మద్యం మత్తులో ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తుంటారు. మద్యం అమ్మకాలతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని, అక్కడ నుంచి బెల్ట్ షాపు తొలగించాలని నిర్వాహకురాలిని స్థానికులు నిలదీస్తే.. పోలీసులకు రోజు, నెలవారీ మామూళ్లు ఇస్తున్నా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ తమనే దబాయిస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్జన ప్రదేశంలో ఏర్పాటు చేసిన మద్యం డబ్బాను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం

- పెరుగనున్న సాగు విస్తీర్ణం
- వానాకాలం ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయ అధికారులు



పంటచేలకు సేంద్రియ ఎరువును తరలిస్తున్న రైతులు



పంట చేలను సిద్ధం చేస్తున్న రైతులు

కాజీపేట: ప్రసుత్త ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించడంతో రైతుల్లో ఆనందం తొణకిసలాడుతోంది. ఖరీఫ్ సీజన్ మరి కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో పంటలు వేసేందుకు వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. కాజీపేట మండలంలోని పది గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లోసాగు చేసే పంటలపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు.

పెరగనున్న సాగు విస్తీర్ణం

గత సీజన్ కంటే ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం పెరగనుంది. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలతో పాటు మిషన్ కాకతీయలో చెరువుల అభివృద్ధి జరగడం ఒక కారణంగా చెప్పొచ్చు. ఈ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న పంటలతో పాటు అధికంగా వరి పంటను 1500ల హెక్టార్లలో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం కూడా పెట్టుబడి సాయం కింద రూ.5వేలు ఇవ్వనుండడంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు.

7వేల హెక్టార్లలో ప్రణాళిక

కాజీపేట మండలంలో 10వేల హెక్టార్ల సాగుభూమి ఉండగా దాదాపు 7వేల హెక్టార్లలో రైతులు పంటల సాగు చేపడతారని అధికారులు భావిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మారిన పరిస్థితుల దృష్ట్యా పంటల సాగు మరింతగా పెరగడానికి అవకాశం ఉందంటున్నారు. వాటన్నింటిని పరిగణలోకి తీసుకున్న వ్యవసాయ అధికారులు పంటల సాగుకు అనుకూలంగా ప్రణాళికలను తయారు చేసి ఆమోదించి చర్యలు చేపట్టారు.

అందుబాటులో విత్తనాలు

రైతులకు కావాల్సిన పంటల విత్తనాలను ఇప్పటికే మడికొండ, ధర్మసాగర్ సహకార సంఘాల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం కల్పించిన రాయితీపై విత్తనాలను అన్నదాతల అవసరాల మేరకు అందించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పంటల దిగుబడులను పెంచుకోవాలనే ఉద్దేశంతో అన్నదాతలు పంట చేలల్లో పశువుల పేడ, కోళ్ల పెంట, గొర్రెల ఎరువు కోసం తలామునకలయ్యారు. వేలాది రూపాయలను ఖర్చు చేసి సేంద్రియ ఎరువులను పంటపొలాలకు తరలిస్తున్నారు

సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి



పంట దిగుబడులు బాగా పెరగాలంటే ప్రతీ రైతు తప్పనిసరిగా కృత్రిమ ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలి. తద్వారా భూసారం పెరుగుతుంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయి. విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

– దొండపాటి శ్రీధర్‌రెడ్డి, ఏఓ, కాజీపేట

ఫీజుల దోపిడీని అరికట్టాలి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ విమర్శించారు. అలాంటి పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఏకశిల పార్కులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఐటీ, నీట్, సివిల్స్, ఫౌండేషన్ కోర్సుల పేరుతో ప్రైవేట్ యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని చెప్పారు. అయినప్పటికీ విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్, ఉపాధ్యక్షుడు సుధగాని మధుగౌడ్, నాయకులు జగన్‌సాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.